వైద్య సేవలకు కేరాఫ్ దెందులూరు సీహెచ్‌సీ



రూ.2.70 కోట్లతో నిర్మించిన దెందులూరు సీహెచ్‌సీ



30 పడకల సీహెచ్‌సీ

- అందుబాటులో నిపుణులైన వైద్యులు
- రూ.2.70 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం

దెందులూరు: నియోజకవర్గం ముఖ్య కేంద్రమైన దెందులూరులో రూ.2.70 కోట్లతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన సకాలంలో వైద్య సేవలు అందిస్తుంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2.70 కోట్లతో సీహెచ్‌సీ నిర్మాణానికి, ఆధునీకరణకు నిధులు మంజూరు చేశారు. పోస్టు మార్టం షెడ్డు నిర్మాణం ప్రారంభమైంది. ఈ సీహెచ్‌సీలో ఐదుగురు స్పెషలిస్టులు, ఇద్దరు సాధారణ వైద్యులు ఉన్నారు. స్త్రీల వ్యాధుల నిపుణులు, పిల్లల వ్యాధుల నిపుణులు, దంత వైద్య నిపుణులు, ముగ్గురు జనరల్ డాక్టర్లు వైద్య సేవలందిస్తున్నారు. సీహెచ్‌సీకి 108, 104 అంబులెన్స్‌లున్నాయి. దెందులూరు, పెదవేగి, కామవరపుకోట, ఏలూరు రూరల్ మండలాల నుంచి ప్రతి రోజూ వంద నుంచి 150 మంది వివిధ రకాల బాధితులు దెందులూరు సీహెచ్‌సీలో వైద్యసేవలు, పరీక్షలు పొందుతున్నారు. ఈ సీహెచ్‌సీలో ఆరుగురు స్టాఫ్ నర్సులు, ఆరుగురు శానిటరీ వర్కర్లు, నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాల్సి ఉంది.



ఆపరేషన్ థియేటర్



వైద్య సేవలందిస్తున్న సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ షాలినీ

సౌకర్యాలు ఏర్పాటు

ఆక్సిజన్ కాన్సంటేటర్స్, 30 పడకలు, నెబ్యులైజర్, పాము, కుక్క, హెచ్ఐవీకి సంబంధించి మందులు, అన్ని రకాల రక్తపరీక్షలు, సుగర్, బీపీ పరీక్షలు, కంటి విభాగం, సాధారణ, సిజేరియన్, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, ఆధునీకరించిన ఆపరేషన్ థియేటర్, రోగులకు వీల్ చైర్లు, జనరేటర్, ఆర్వో వాటర్ అందుబాటులో ఉంది.



అందుబాటులో అంబులెన్స్



కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో పరిశుభ్రత కలిగిన సీహెచ్‌సీ ఆవరణ

150కు పెరిగిన ఓపీ



సీహెచ్‌సీ ఆధునీకరణతో పెరిగిన సౌకర్యాలు, వైద్యులు సంతృప్తికరమైన సేవలతో గతంలో 50–70 ఉన్న రోగుల సంఖ్య నేడు రోజుకు 150 మందికి చేరింది. దాదాపు ప్రతి రోజూ 30–40 కిలోమీటర్ల నుంచి బాధితులు (ఏలూరు జీజీహెచ్) ఉన్నప్పటికీ దెందులూరు సీహెచ్‌సీకి రావడం ఎంతో సంతృప్తికరంగా ఉంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కలెక్టర్, జిల్లా వైద్యాధికారుల ప్రోత్సాహకం సంతృప్తిగా ఉంది.

– డాక్టర్ సుందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్

అంకితభావంతో వైద్యుల సేవ



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషితో 2.70 కోట్లతో నిధులు మంజూరు చేయడం. వైద్య పరికరాలు, వైద్యుల సంఖ్య, వసతుల పెరిగాయి. అంకితభావంతో కూడిన వైద్యుల సేవలు విస్తరించడం వల్ల రోజుకు 150 మంది దెందులూరు సీహెచ్‌సీలో వైద్యం పొందుతున్నారు.

– కట్టా ఏసుబాబు, సీహెచ్‌సీ అడ్వైజరీ బోర్డు మెంబర్

క్లుప్తంగా

జేఈఈ పుస్తకాలు గ్రంథాలయానికి అందజేత



గ్రంథాలయ అధికారి గంగాధరరావుకు పుస్తకాలు అందజేస్తున్న డీఎఫ్‌వో ప్రభాకరరావు

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖా గ్రంథాలయానికి గ్రామానికి చెందిన డీఎఫ్‌వోగా పని చేస్తున్న ప్రభాకరరావు జేఈఈ పుస్తకాలు ఆదివారం అందజేశారు. ఈ పుస్తకాలు జేఈఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడతాయని డీఎఫ్‌వో తెలిపారు. సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావు ద్వారా ఈ పుస్తకాలను గ్రంథపాలకుడు గంగాధరరావుకు అందజేశారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు



పెదపాడు ఎస్సై శుభశేఖర్

పెదపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని పెదపాడు ఎస్సై శుభశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు 144 సెక్షన్‌తోపాటు పోలీసు యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ప్రజలు ఎక్కడా గుంపులుగా ఉండరాదని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు నాయకులు గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులంతా సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



హెచ్‌ఎం సునీత ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్

భీమడోలు: విద్యా సంస్కరణల్లో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్ ఆపరేట్ చేసిన హెచ్‌ఎంలను విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ అభినందించారు. ఈనెల 18న శనివారం గుండుగొలను, భీమడోలు ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలకు అనుగుణంగా పాఠశాలలకు అందించిన ఐఎఫ్‌పీలను గుండుగొలను హెచ్‌ఎం జి.సునీత స్వయంగా ఆపరేట్ చేసిన విధానాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను సందర్శించిన నేపథ్యంలో మహిళా హెచ్‌ఎంలు ప్లానెల్స్‌ను వినియోగించే విధానంపై అవగాహన లేక ఆపరేట్ చేయడం లేదని ఆయన తెలిపారు. గుండుగొలనులో పదో తరగతి ఫలితాలపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేసారు. భీమడోలు హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు కూడా ఐఎఫ్‌పీను రిమోట్‌తో ఆపరేట్ చేయడం చేసి తాను బోధించే సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను చూపడంతో ప్రవీణ్ ప్రకాష్ అయనను అభినందించారు. దీనితో ఆ హెచ్‌ఎంలను శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదపాడు : పెదపాడు సబ్‌స్టేషన్ సెక్షన్ 33/11కేవీ పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ 11కేవీ సత్యవోలు ఫీడర్ 11కేవీ గోగుంట ఫీడర్ న్యూలైన్ల నిర్మాణంతో పాటు లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 20,21,22 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. సోమ, మంగళ, బుధవారం ఉదయం 6 గంటలకు నుంచి మధ్యాహ్నం వరకు నిలుపుదల చేస్తామని తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, సకలకొత్తపల్లి, కొణికి, గోగుంట, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు, నాయుడుగూడెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రత్యేక ప్రార్థనలు



వేళంకిణి మాత దేవాలయంలో మోకాళ్లపై నడిచి ప్రార్థనలు చేస్తున్న పోతురాజు ప్రసాదరావు

దెందులూరు: వంగూరు గ్రామానికి చెందిన పోతురాజు ప్రసాదరావు తమిళనాడులోని నాగపట్నం జిల్లా ప్రముఖ క్రైస్తవ దేవాలయం వేళంకిణి మాత చర్చిలో ఆదివారం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటంతో మోకాళ్లపై నడిచి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ప్రసాదరావుతోపాటు ఆయన భార్య సామ్రాజ్యం, కుమారుడు ప్రశాంత్, కుతూరు మహిమతో కలిసి కుటుంబ సమేతంగా వేళంగిణి మాత దేవాలయంలో వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు చేశారు.

చదువుతో సమాజంలో గౌరవం

భీమడోలు: నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ చదువు వల్లే గౌరవం వస్తుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ టీవీ ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం వేసవి శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో ఘనంగా సాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. చిన్నారులకు చక్కని నీతి కథలు చెప్పారు. జనరల్ నాలెడ్జ్ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం టీవీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చదువే ఆస్తి అని, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు ఆయుధమన్నారు. మంచి పౌరులుగా ఎదగడానికి పుస్తకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. వేసవి సెలవుల్లో చిన్నా రులు గ్రంథాలయాల్లోని విజ్ఞానాన్ని అందుకుని ఉత్తమ విద్యార్థులుగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, గ్రామ పెద్దలు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల కోసం పుచ్చలపల్లి పోరాటం



గణపవరం సీపీఎం ఆఫీసులో పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



భీమడోలులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు

గణపవరం: అసంఘటిత రంగంలో అన్ని రకాలుగా శ్రమ దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కూలీలకు తొలిసారిగా సంఘాన్ని ఏర్పాటుచేసి వారికి న్యాయం చేసిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని పలువురు అన్నారు. ఆదివారం సీపీఎం సీనియర్ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా గణపవరం సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ, సీపీఎం నాయకులు పి.నర్సింహమూర్తి, ఎం.పెంటారావు, కె.త్రినాథ్, ఎం.వెంకటేశ్వరరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

కేశవరంలో: రైతుల కూలీలకు న్యాయం చేయడానికి జీవితాంతం పోరాడిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని జిల్లా సీపీఎం కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా కేశవరంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రాంతంలో సుందరయ్యకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు.

సుందరయ్య బాటలో నడవడమే నిజమైన నివాళి

భీమడోలు: కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య బాటలో నడవడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని సీపీఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నేతలు ఘన నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, ఎంపీగా కమ్యూనిస్ట్ నాయకుడిగా రాష్ట్ర ప్రజల అభివృద్ధికి సుందరయ్య విశేష కృషి చేసి ప్రజల మనస్సును చురగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కట్టా భాస్కరరావు, జి,.ప్రసాదరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కేతా నాగయ్య, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించాలని కోరుతూ ఆదివారం పెదలింగంపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. భీమడోలు పంచాతీయ పరిధిలోని పెదలింగంపాడులో మరియ మాతా ఉత్సవాల్లో మూడవ రోజైన ఆదివారం వార్డు సభ్యురాలు చల్లా విమల, నాయకులు చక్కా పుల్లయ్య ఆధ్వర్యంలో మరియ మాతా ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని ప్రార్థనలు చేసారు. జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్‌లో రాష్ట్రంలో 175 ఎమ్మెల్యే స్థానాల్లో, 25 ఎంపీ స్థానాల్లోని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ వారంతా ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఉంగుటూరు ఎమ్మెల్యేగా వాసుబాబు అధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేసారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వారి గెలుపునకు సోపానాలని వారంతా పేర్కొన్నారు.



పెదలింగంపాడులో మరియ మాతా ఊరేగింపులో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఘనంగా కల్యాణోత్సవాలు ప్రారంభం

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న కలియుగ దైవం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మశాఖ ఆధ్వర్యంలో ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు స్వామి వారికి విశేష పూజలు చేసారు. ఆలయంలో మేళ తాళాల నడుమ స్వామి వారిని పెళ్లి కుమారుని తంతు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించి ముస్తాబు చేసారు. రాత్రి ధ్వజారోహణం వేడుక కన్నుల వేడుకగా నిర్వహించారు. ఆలయంలోని ధ్వజ స్తంభానికి గరుడ పెళ్లి పత్రికను ఉంచి సకల దేవతలకు ఆహ్వానం పలికారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావులు పూజలు చేసారు. ఈనెల 21న స్వామి వార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెద్దలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజ స్తంభం వద్ద గరుడ పెళ్లి పత్రికను ఉంచిన పూజారులు, ఆలయ ట్రస్టీ చైర్మన్ దంపతులు

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 8 గంటలకు చిన్నారులు ముందుగా ప్రార్థనా గీతాలతో కార్యక్రమం ప్రారంభించారు. నీతి కథలు, దేశభక్తి కథలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను విద్యార్థులు వివరించారు. టీచర్ వీ. నళిని విద్యార్థులకు దేశభక్తి గీతాలను పాడడం నేర్పించారు. క్రాఫ్ట్ నిపుణులురాలు శ్రీవల్లి ప్లాస్టిక్ బాటిళ్లతో గృహాలంకరణ సామగ్రిని తయారు చేయడంపై శిక్షణనిచ్చారు. హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ విద్యార్థులకు మైండ్ పవర్ గేమ్స్, మెమరీ గేమ్స్‌లో శిక్షణనిచ్చారు. ఉప గ్రంథపాలకుడు నారాయణ రావు పర్యవేక్షించగా, సిబ్బంది వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజస్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్, హెచ్ఐవీ వంటి ప్రాణాంతక వ్యాధులతో మృతి చెందిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దాం.. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో ఎయిడ్స్ చిహ్నంలా కొవ్వొత్తులను వెలిగించారు. ఈ సందర్భంగా వెలిగించిన కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్ఐవీ వంటి రోగాలపై ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఏటా మే 3వ ఆదివారం ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిడ్స్, హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలు కలిగి ఉండాలన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న భయానక రోగాలను తరిమి కొట్టేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. ఎయిడ్స్, హెచ్ఐవీ రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను అందిస్తుందని, వాటిని వాడితే జీవితకాల పరిమితి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి, సిబ్బంది పాపారావు, సిస్టర్ పి.విక్టరీ, ల్యాబ్ సిబ్బంది అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



భీమడోలు సీహెచ్‌సీ వద్ద అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న వైద్యులు సంతోష్‌కుమార్, సిబ్బంది